## నేషనల్ మార్షల్ ఆర్ట్స్‌లో విజ్ఞశ్రీకి గోల్డ్ మెడల్




చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 24 : 4వ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీల్లో నాలుగు దేశాలు (ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్) పాల్గొన్నాయి. శంకర్‌పల్లి మండల పరిధిలోని పర్వేద గ్రామానికి చెందిన శ్రీధర్ కుమార్తె విజ్ఞశ్రీ బంగారు పథకాన్ని( గోల్డ్‌మెడల్) సాధించింది. విజ్ఞశ్రీని, తల్లిదండ్రులను ప్రముఖులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కీచక ఉపాధ్యాయుడు మాకొద్దు

### 16 మంది విద్యార్థినుల ఆవేదన

వికారాబాద్, ఫిబ్రవరి 24 : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఉపాధ్యాయ వృత్తికే మాయని మచ్చ తెచ్చాడు. వికారాబాద్ మండల పరిధిలోని ధ్యాచారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులపై గత కొన్ని రోజులుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. పాఠశాలలో 4వ తరగతిలో 10 మంది, 5వ తరగతిలో 6గురు విద్యార్థినులపై చెయ్యి వేయడం, కడుపుపై గిల్లడం, అసభ్యంగా తాకుతున్నాడని విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. మూడు రోజుల క్రితం విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఆ ఉపాధ్యాయుడిపై మండిపడ్డారు. 16 మంది విద్యార్థినులు ఈ సార్ మాకొద్దు అంటూ ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆయనను పిలిచి మరోసారి ఇలాంటివి చేయకూడదని మందలించారు. ఈ విషయం వికారాబాద్ మండల విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆ సార్‌ను ధ్యాచారం పాఠశాల నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.




2023లో నిండుకుండలా కళకళలాడుతున్న మేడిపల్లి సాలి చెరువు




ప్రస్తుతం చుక్కనీరు లేకుండా ఎండిపోయిన మేడిపల్లి సాలి చెరువు

# కమ్ముకుంటున్న కరువు ఛాయలు

- బీఆర్ఎస్ హయాంలో వైభవం.. నేడు దుర్భిక్షం
- ఎండిపోయిన చెరువులు, కుంటలు
- వట్టిపోతున్న బోరుబావులు
- పంటలను కాటేస్తున్న కరువు
- పైకిరాని పాతాళ గంగ

మండలంలో రోజురోజుకూ కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. కేసీఆర్ హయాంలో గత పదేండ్లు చెరువులు, కుంటలు నిండి మత్తడి దుంకి రైతుల కండ్లలో ఆనందం నిండింది. కానీ, ప్రస్తుతం సీన్ ఒక్కసారిగా రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తూనే కరువును తీసుకొచ్చింది. నాడు నీటితో కళకళలాడిన చెరువులు, కుంటలు రోజురోజుకూ అడుగంటుతున్నాయి. బోరుబావులు అప్పడే ఆగిఆగి పోస్తున్నాయి. వేసవిలో వ్యవసాయానికి, సాగునీటికి ప్రమాద ఘంటికలు మోగే పరిస్థితులు నెలకొన్నాయి.

- యాచారం, ఫిబ్రవరి 24

గత కేసీఆర్ హయాంలో సమృద్ధిగా వానలు కురిసి అన్నదాతల కండ్లలో ఆనందం వెల్లివిరిసింది. బోరుబావుల్లో పుష్కలంగా నీరు ఉండడం, రెప్పపాటు కూడా పోని 24 గంటల ఉచిత కరెంటుతో పంటలకు సరిపడా నీరు అందడంతో ఎటూ చూసినా పచ్చదనమే నిండింది. రాసులకొద్దీ ధాన్యం దిగుబడి రావడంతో రైతులు సుభిక్షంగా, సంతోషంగా ఉన్నారు. కానీ.. 14 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వస్తూనే కరువును వెంట తీసుకొచ్చింది. నాడు నీటితో కళకళలాడిన మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు చుక్కనీరు లేకుండా ఎండిపోగా, ఒకటి రెండు గ్రామాల్లో చెరువుల్లోనే నీళ్లు ఉన్నాయి, అవి కాస్తా రోజురోజుకూ అడుగంటుతున్నాయి. వేసవిలో వ్యవసాయానికి, సాగు నీటికి ప్రమాద ఘంటికలు మోగే ప్రమాదం పొంచి ఉన్నది. ఆయకట్టు ప్రాంతానికీ సాగు నీరు సమస్యగా మారింది. రానున్న రోజుల్లో సరిపడా నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. బోరుబావులు అప్పుడే ఆగిఆగి పోస్తున్నాయి. గత ఐదారేండ్లతో పోలిస్తే ఈ యాసంగిలో పంటల సాగు గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా వరి సాగు చాలా తగ్గిందని అధికారులు పేర్కొంటున్నారు. రైతులు ఆహార పంటలను వదిలేసి వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. అందులోనూ నష్టాలు రావడంతో కొంతమంది రైతులు ఉన్న కొద్దిపాటి నీటితో డ్రిప్పు పద్ధతిలో కూరగాయలు, ఆకు కూరలను సాగు చేస్తున్నారు. అక్కడక్కడ బోరుబావులు ఎండిపోవడంతో కూరగాయలు సైతం ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పైగా కరెంటు ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి.

### ఎండిపోతున్న చెరువులు

మండలంలో ఆరు పెద్ద చెరువులు, 86 చిన్న చెరువులు, కుంటలు ఉన్నాయి. గత కేసీఆర్ పాలనలో ఇవన్నీ నీటితో నిండి కళకళలాడాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నేడు చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన సాలిచెరువు, ఎక్వచెరువు, ఊరచెరువు, తక్కళ్లపల్లి చెన్నారెడ్డి చెరువు, నల్లవెల్లి చెరువులు ఎండిపోగా.. మల్కీజ్‌గూడ మగ్దూంఅలీ చెరువు, నందివనపర్తి కామునిచెరువు, నానక్‌నగర్ చెరువులు పూర్తిగా ఎండిపోయి కంప చెట్లకు నిలయాలుగా మారాయి. చింతపట్ల లక్ష్మణచెరువు, తాటిపర్తిబందం చెరువులో కొద్దిపాటి నీరు ఉన్నది. అది కూడా వేసవి తాపానికి పూర్తిగా ఎండిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇక కుంటలన్నీ ఇప్పటికే ఎండిపోయాయి. రానున్న రోజుల్లో సరిపడా వర్షాలు కురియకపోతే సాగునీరుతోపాటు తాగునీటి ఎద్దడి తప్పదని ప్రజలు పేర్కొంటున్నారు.



అడుగంటిన ఎక్వ చెరువు

### సాగునీరు లేక ఎండుతున్న పంటలు

మార్చి రాక ముందే ఎండలు మండుతుండడంతో అక్కడక్కడ పంటలు ఎండిపోతున్నాయి. వరితోపాటు కూరగాయల పంటలూ సరిపడా సాగు నీరు అందక ఎండుముఖం పడుతున్నాయి. పెట్టిన పెట్టుబడి వస్తుందా అని అన్నదాతలు మథనపడుతున్నారు.

### పైకి రాని పాతాళ గంగ

మండలంలో క్రమక్రమంగా భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతున్నవి. బోరుబావుల్లో ఉన్న నీరు పాతాళానికి పడిపోతున్నది. ఎండలు దంచి కొడుతుండడంతో ఇప్పటికే కొన్ని బోరుబావులు ఆగిఆగి పోస్తుండగా.. మరికొన్ని పూర్తిగా వట్టిపోయాయి. నూతనంగా బోర్లు వేసినా ఫలితం ఉండడం లేదు. 500 నుంచి 1000 ఫీట్లలోతు వరకు వేసినా దుమ్మూదూళి తప్ప చుక్క నీరూ రావడంలేదు.

### డిండి జలాలు వచ్చేనా..?

మండలంలో సరిపడా సాగునీటి వనరుల్లేక కరువు కాటకాలు నెలకొంటున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం డిండి ప్రాజెక్టుతో మండలంలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని భావించింది. డిండి నుంచి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడ రిజర్వాయర్ నుంచి మంతన్‌గౌరెల్లి మీదుగా చౌదర్‌పల్లి వద్ద 4 టీఎంసీ సామర్థ్యం గల రిజర్వాయర్‌ను నిర్మించాలని చర్యలు చేపట్టింది. పైపులైన్ వేసే ప్రాంతాలను మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇంజినీర్లతో కలిసి సర్వే కూడా చేయించారు. ఈ ప్రయత్నం సక్సెస్ అయితే కరువు నేలపై సిరులు కురిసినట్లేనని రైతులు భావించారు. అయితే, కేసీఆర్ హయాంలో వరుణుడు కరుణించడంతో రాష్ట్రంలో గత పదేండ్లు పుష్కలంగా వర్షాలు కురిసి.. చెరువులు, కుంటలు మత్తడి పోశాయి, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బోరుబావులు ఎగిసి దూకాయి. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు మత్తడి పోయడంతో డిండి జలాలతో అవసరం లేకుండా పోయింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కథ మళ్లీ మొదటికొచ్చింది. డిండి జలాల నీరు రావడంపైనే అన్నదాతల ఆశలు ఆధారపడి ఉన్నాయి.

### పంటలు ఎండిపోతున్నాయి



సాగునీరు లేక క్రమంగా పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఎండలు దంచి కొడుతుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. రానున్న రోజుల్లో వర్షాలు కురువకపోతే వరి, కూరగాయలు, ఆకుకూరల పంటలు మొత్తం ఎండిపోతాయి. ఇప్పటికే రైతులు సగం ఆశలు కోల్పోయారు. సరిపడా వర్షాలు కురువకపోతే పంటలు చేతికిరాక పెట్టిన పెట్టుబడి రాక అన్నదాతలు తీవ్రంగా నష్టపోతారు.

**- సాలయ్య, రైతు, మేడిపల్లి**



బీడు భూములుగా మారిన పంట పొలాలు



ఎండిపోయిన మల్చరాస్ కుంట

## మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా మల్లేశ్



రంగారెడ్డి, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా యాచారం మండలం గున్‌గల్ గ్రామానికి చెందిన కుంటి మల్లేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ అధ్యక్షుడు దేవేంద్రప్రసాద్, జాతీయ నాయకుడు అయోధ్య తదితరుల ఆధ్వర్యంలో సోమవారం గున్‌గల్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మల్లేశ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో మాదిగ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తానని, తనపై నమ్మకముంచి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవడానికి కృషిచేసిన మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండాల సాయిరెడ్డిని కలిసిన సంఘం సభ్యులు

## రైతాంగం సమస్యల పట్ల నిరంతర పోరాటం

### భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కొండాల సాయిరెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 24 : తెలంగాణ రాష్ట్ర రైతాంగం సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తామని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కొండాల సాయిరెడ్డి అన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను సోమవారం శంషాబాద్ విమానాశ్రయంలో సంఘం సభ్యులు కలిసి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘం రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, కందవాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి విశ్వనాథం పాల్గొన్నారు.

## కార్మికుల ఐక్యతను కాపాడాల్సింది ఆఫీస్ బేరర్లే..

### సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాములు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాములు

కొత్తూరు, ఫిబ్రవరి 24 : కార్మికుల ఐక్యతను కాపాడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులు, ఆఫీస్ బేరర్లపైనే ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. మండల పరిధిలోని పాప్రస్ పోర్టులో మేకగూడ నాట్కో ల్యాబ్స్ సీఐటీయూ నాయకులు, ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యుల ముఖ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో లేబర్ కోర్టులు అమలవుతాయన్నారు. నాట్కో ల్యాబ్ వద్ద జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యలుంటే కమిటీలో చర్చించుకొని ఆఫీస్ బేరర్లతో సమావేశమై పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు బీసీ సాయిబాబా, నాట్కో యూనియన్ ప్రెసిడెంట్ మల్లేశ్ పాల్గొన్నారు.

### యాచారం సీఐ నరసింహారావుపై బదిలీ వేటు

## నూతన సీఐగా నందీశ్వర్‌రెడ్డి



యాచారం, ఫిబ్రవరి 24 : మండలంలో జరిగిన ఓ కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ నరసింహారావును బదిలీ చేస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని మాల్‌లో మతిస్థిమితం లేని 70 ఏళ్ల ఓ వృద్ధురాలిపై నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఎరుగండ్లపల్లికి చెందిన శ్రీశైలం(25) డిసెంబర్ 9న లైంగికదాడి యత్నానికి పాల్పడిన ఘటన తెలిసిందే. రెండు నెలల తరువాత సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి ఇటీవలే రిమాండ్‌కు తరలించారు. ఘటన గురించి పోలీసులు, పెట్రో మొబైల్ సిబ్బందికి విషయం తెలిసినా కేసు చేయకుండా సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధితురాలి కుటుంబసభ్యులు ఇటీవల సీపీకి ఫిర్యాదు చేశారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో ప్రత్యేకంగా విచారణ చేయించిన సీపీ సీఐ నరసింహారావుపై బదిలీ వేటు వేశారు. అతడిని యాచారం పీఎస్ నుంచి మల్కాజ్‌గిరి సీసీఎస్‌కు బదిలీ చేశారు. అతడి స్థానంలో నూతన సీఐగా మల్కాజ్‌గిరి సీసీఎస్ నుంచి నందీశ్వర్‌రెడ్డి బదిలీపై బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు, పేకాట, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, అక్రమ రవాణా, సైబర్ నేరాలను నియంత్రించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. నేరాలను అరికట్టడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగినా 100కు సమాచారం ఇవ్వాలని, నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

## ఫర్నిచర్ గోదాంలో అగ్నిప్రమాదం

- నాలుగు ఏసీలు దగ్ధం.. వేడికి కాలిన రెండు కార్లు
- ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం

మణికొండ, ఫిబ్రవరి 24 : జనవాసాల మధ్య ఏర్పాటైన ఫర్నిచర్ గోదాంలో చెలరేగిన మంటలతో చుట్టుపక్కల ఉన్న నివాసితుల ఇళ్లలో సామగ్రి దగ్ధమైన ఘటన మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం జరిగింది. విద్యుత్‌శాఖ, మున్సిపాలిటీ, అగ్నిమాపకశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందంటూ స్థానిక ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. కొన్నాళ్లుగా జనవాసాల మధ్యలో ఫర్నిచర్ గోదాంలను ఏర్పాటు చేయొద్దంటూ మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అనుమతులిచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ గీతాంజలి పాఠశాల సమీపంలోని మణికొండ మున్సిపల్ పరిధిలోని మలేషియా సోఫాసెట్ ఫర్నిచర్ గోదాంలో సోమవారం విద్యుత్‌షాక్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఎగిసిపడిన మంటలతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇరవై అడుగుల ఎత్తులో మంటలు ఎగిసిపడటంతో అపార్టుమెంట్ నివాసితుల ఏసీ కంప్రెషర్లు, పార్కింగులో ఉన్న రెండు కార్లు మంటల వేడికి కాలిపోయాయి. ప్రమాదాన్ని గమనించిన నిర్వాహకులు అక్కడి నుంచి పరారయ్యారని, నిర్వాహకులపై, భూమి యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### గంట తర్వాత వచ్చిన అగ్నిమాపక బృందం

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకున్న అగ్నిప్రమాద ఘటన విషయం తెలిసిన గంట తర్వాత అగ్నిమాపక సిబ్బంది రావడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఫర్నిచర్ గోదాం వరకు ఫైర్ ఇంజన్ రావడానికి కూడా రహదారి సక్రమంగా లేకపోవడంతో సమస్య తలెత్తిందని స్థానికులు ఆరోపించారు.

### చర్యలు తీసుకుంటాం

జనవాసాల మధ్యలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్ గోదాం నిర్వాహకులతో పాటు భూయజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. స్థానికుల అభ్యంతరాలుంటే ఏర్పాటు చేయవద్దు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇకపై ఏర్పాటయ్యే ఫర్నిచర్ గోదాంలకు సరియైన అనుమతులు లేకపోతే సీజ్ చేసేందుకు చర్యలు చేపడుతాం.

**- హరికృష్ణారెడ్డి, నార్సింగి ఇన్‌స్పెక్టర్**

## మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్




మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వికారాబాద్, ఫిబ్రవరి 24 : మున్సిపల్‌లో పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. మున్సిపల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పనులు చేస్తున్న ఉద్యోగ కార్మికులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ కటింగ్ స్లిప్పులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 14 మందికి సంవత్సరం జీతాలు వెంటనే ఇవ్వాలని, ఒంటిపూట డ్యూటీలు నిర్వహించాలని, ప్రతి నెల రెగ్యులర్ జీతాలు ఇవ్వాలని తెలిపారు. కార్మికులకు పనిముట్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఈ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కార్మికుల సమస్యలు అసెంబ్లీలో చర్చించి జీవో విడుదల చేయాలని వివరించారు. అనంతరం కమిషనర్ కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా




రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఆదిబట్ల, ఫిబ్రవరి 24 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులతో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలన్నారు. రూ.15 వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులు అప్పులు చేసి వంటలు వండి విద్యార్థులకు పెడుతున్నా కనీసం ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ధర్నా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ నిధుల వీడియో కాన్ఫరెన్స్

మంచాల, ఫిబ్రవరి 24 : మంచాల రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పీఎం కిసాన్ 19వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, రైతులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుజాత మాట్లాడుతూ.. 2019 ఫిబ్రవరి 1 లోపల పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. పీఎం కిసాన్ పథకం రేషన్‌కార్డు ప్రాతిపదికన కుటుంబంలో ఒక్కరికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. 2019 తర్వాత పాస్‌పుస్తకం పొందిన రైతులుల ఎప్పుడు నమోదు చేసుకోవాలో కేంద్ర ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే రైతులకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, ఏఈవోలు పాల్గొన్నారు.